
# ఊర్మిళ


— పంతం సుజాత



శ్రీరాముడు వనవాసానికి బయలుదేరుతున్నాడు. పక్కనే సీతమ్మ వారు. పట్టు పీతాంబరాలు విడిచి నార వస్త్రాలు ధరించినా...తేజోవంతంగా వెలిగిపోతున్నారు ఆ అమృత మూర్తులు ఇద్దరూ. రాముడు సర్వాంతర్యామి కనుక లోక కళ్యాణార్థం ఈ ప్రయాణం అని తెలిసి అతని వదనం ప్రశాంతంగా ఉంది. రాముని సన్నిధే నిధి అన్న ఆనందం సీతమ్మ వారిలో గోచరిస్తుంది.

అయోధ్యలో చిన్నా, పెద్దా అంతా దుఃఖాశ్రువులు విడుస్తున్నారు. దశరథ మహరాజు కంటికీ, మింటికీ ఏకధాటిగా విలపిస్తున్నాడు. కైకేయి తప్ప మిగతా ఇద్దరి భార్యల దుఃఖానికి అంతేలేదు. రాముడు లాంటి కొడుకుని దూరం చేసుకుని ఏ తల్లిదండ్రులు జీవించగలరు. ఉన్నత వ్యక్తిత్వం, సత్యము, శీలమూ కలిసిన సుందర రూపం, ముఖ్యంగా దైవత్వం జాలువారే ఆ చూపు...

చాలు మహాప్రభో! చాలు. ఈ జన్మకీ దర్శన భాగ్యం చాలు తండ్రీ. నువ్వేలిన రాజ్యం 'పుణ్య తీర్థమే' అయినా నిన్ను చూసిన తర్వాత నాకు



చూపు వ్యర్థం. 'రామా' అని పిలిచిన తర్వాత, నాకు మాటలు వ్యర్థం. ఈ రెండూ లేని బ్రతుకు వ్యర్థం. అందుకే నన్ను నీలో ఐక్యం చేసుకో స్వామి. అనాలనిపించే ఆ చిర్నవ్వు.

ఏ ప్రజలు వదులుకోగలరు ఆ దైవాన్ని. ఒక్క సీతారాములు తప్ప కైకని తిట్టనివారు లేరు. అతనికి తెలుసు ఆమె కోరిక ఒక నెపం మాత్రమే నని. పుత్రవాత్సల్యపు పొర కమ్మిన కైక రాముని ఎడబాటుని గుర్తించలేకపోయింది.

లక్ష్మణుడు ప్రపంచంలో ఉన్న అసహ్యాన్నంతా చూపుల్లో సంధించి కైకేయి మీదకి వదిలాడు. ఆ బాణాల వాడి చాలా ఆలస్యంగా తగిలిందామెకి. కాని అప్పటికే జరగవలసిన ఘోరం జరిగిపోయింది.

భక్తి ప్రేమలతో సీతారాముల పాదాలకు నమస్కరించాడు లక్ష్మణుడు. రాముని కళ్లలో అదే నిశ్చలత్వం.

"లక్ష్మణా!" అన్నాడు.

ఆ పిలుపులో ఎన్నో ప్రశ్నలు. ఎన్నో సమాధానాలు.

"మీతోనే నా జీవితం. నీ సేవే నా పరమార్థం" అన్నాడు లక్ష్మణుడు.

తండ్రి దగ్గర వీడ్కోలు తీసుకోవడానికి బయలుదేరాడు రాముడు. వెనకే సీతమ్మ. ఆ వెనక లక్ష్మణుడు అనుసరించారు.

** ** **

ఊర్మిళ ఉన్నత వంశానికి చెందిన రాజపుత్రిక ఇంకో ఉత్తమ రాజవంశానికి కోడలిగా వచ్చిన వనిత. కష్ట సమయంలో స్త్రీ ఎలాంటి మనో నిబ్బరాన్ని అలవర్చుకోవాలో ఉగ్గుపాలతోనే నేర్చిన నారీమణి లక్ష్మణుని నిర్ణయం విన్న మరుక్షణం నుంచీ నిశ్చలావస్థలోనే ఉంది.

తండ్రిలాంటి రాముడు, తల్లిలాంటి సీతమ్మ దూరమవుతుంటే దుఃఖపూరితమైన మనసు, భర్త ఎడబాటు తెలిసి నిశ్చలమైపోయింది. యాంత్రికంగా ఊపిరి పీలుస్తోంది. విడిపోయే క్షణాలు దగ్గరయ్యే కొద్దీ ఆమె రెప్పలల్లార్చడం మర్చిపోయింది. పరదాల చాటునుండి భర్తనే చూస్తోంది. మళ్లీ ఎన్నాళ్లకు దర్శనం. అప్పటి వరకూ ఈ ఊపిరి ఉంటుందా!

కష్టంలో, సుఖంలో నాతోనే ఉంటానని పెళ్లినాడు ప్రమాణం చేసారు కదా! స్వామి మరి మీ వెంట రావడానికి నన్నెందుకు అనుమతించలేదు. నేనొక జీవాన్ననుకున్నారా! జడ పదార్థాననుకున్నారా! నిర్ణయించుకునే ముందు నాతో ఒక్క మాట... ఓహో! మీ అన్నగారి సేవలో నేను ఆటంకం అనుకున్నారా! మీకు సోదరుడు ఎంత ముఖ్యమో నాకు భర్త అంతే ముఖ్యం అన్న విషయం తెలీలేదా! అంత ఉన్నత వ్యక్తి సోదరుడైన మీలో ఈ లోపమా!

మీకు దైవసమానులైన సీతారాములు నాకు మాత్రం కాదని ఎలా అనుకున్నారు? తెల్లవారితే నా దైవానికి నమస్కరించే భాగ్యాన్ని నాకెందుకు దూరం చేస్తున్నారు? ఏ జన్మలో ఎవర్ని విడదీసిన పాపమో నన్నిలా చుట్టుకుంది.

మగత నిద్రలో ఉలికిపాటుని, మెలకువలో ఎడబాటుని నేను భరించలేను. ఘడియ తర్వాత మీరు వెళ్లిపోతారన్న నిజాన్ని నా మనసు తట్టుకోలేకపోతోంది. క్షమించండి ప్రభూ! మీరు వెళ్లకముందే నాలో పలువిధాల ఆలోచనలు చోటుచేసుకుంటున్నాయి.

మీమీద నాకున్న ప్రేమ, అనురాగం, ఇలాగే ఉండాలి. ఏ దుష్ట భావాలు నాలో ప్రవేశించకూడదు. నన్ను ఒంటరిగా వదిలి వెళ్లిపోయారన్న ఉక్రోషం మీకు వ్యతిరేకంగా మారకూడదు. దీనికి ఒక్కటే మార్గం. నా మనసుని చంపేయాలి. అది నిద్రలోనే సాధ్యం. మీరు తిరిగి వచ్చేవరకూ ఆ గాఢ నిద్రనే నాకు ప్రసాదించండి ప్రభూ!

ఏదో కలకలం. పరదాల చాటుగా నిల్చున్న ఊర్మిళ ఆలోచనల్లోంచి తెప్పరిల్లి చివ్వున తలెత్తి చూసింది. రామునితో పాటుగా అందరికీ వీడ్కోలు నమస్కారాలు అందిస్తున్నాడు లక్ష్మణుడు. తెల్లబోయింది ఊర్మిళ.

నాకంటూ ప్రత్యేకత ఏమీలేదా! పురప్రజలతో పాటు నేనూ అంతేనా అనుకుంది. మళ్లీ అంతలోనే తేడా మాత్రం ఏముంది? వారి కంట్లోనూ నీరే. నా కంట్లోనూ నీరే చెమ్మగిల్లింది అనుకుంది. అప్పటి వరకూ కళ్లంతా ఆక్రమించుకున్న నీటిపొర ఒక్క చోటకి చేరి నేల రాలడానికి సిద్ధంగా ఉంది. నిశ్చలమైన ఆమె కళ్లల్లోకి చలనం వచ్చి చూపులు అన్న గారిని అనుసరిస్తున్న భర్త పాదాలపై నిలిచాయి.

ఆ అడుగులు ఆగి ఒక్కసారి నాకోసం ఇటు రాకూడదా! ప్రాణాన్ని పొందిగ్గా పరిచి, చూపుల చిరుదివ్వెలు వెలుగిస్తూ మీకు దారి చూపుతాను. ఆ మార్గాన వచ్చి మీరు తిరిగి వచ్చేవరకూ జీవించగలిగే జీవశక్తిని ప్రసాదించండి ప్రభూ – అంటూ మనసులోనే వేడుకుంది.

ఏదో సందేశం అందినట్టుగా ఆగాడు లక్ష్మణుడు. ఊర్మిళ చూపులూ ఆగిపోయాయి. శరీరం శృతి తప్పి స్పందిస్తోంది. ఆమె మనోభావాలు చదవడానికి వీల్లేకుండా ఇద్దరికీ మధ్య పరదాలు అడ్డుగా నిలిచాయి.

చిత్రంగా ఆమె ఆలోచనలు దారిమళ్లాయి. అప్పటివరకూ అతను రాలేదని బాధపడ్డ ఆమె, ఇప్పుడు వస్తుంటే కంగారు పడుతోంది. ఆ దగ్గరతనం దూరమవ్వడానికని తెలిసి విలవిల్లాడిపోతోంది.

వద్దు! ప్రభూ...రావద్దు. మీ ఆగమనాన్ని చూసి సంతోషించిన నా కళ్లు, మీ వీడ్కోలు విని, మీ నిష్క్రమణ తెలిసి తట్టుకోలేక తడితేరితే అది చూసి మీరు సంకల్పాన్ని విడనాడే ప్రమాదముంది. మీ స్వామి కార్యం సిద్ధించదు. వెళ్లిపొండి ప్రభూ...నన్ను పట్టించుకోకుండా వెళ్లిపొండి.

పరదా తొలగించుకుని లక్ష్మణుడు లోపలికి వచ్చాడు. చెమ్మగిల్లిన కళ్లని కన్పించనివ్వకుండా చటుక్కున కళ్ళు దించుకుంది ఊర్మిళ. భర్త వేసే ఒక్కొక్క అడుగు దగ్గర పడుతుంటే, ఒక్కొక్క ఇంద్రియాన్ని కూడ గట్టుకుని, యోగ సమాధిలాంటి స్థితికి సిద్ధమవుతోంది. లక్ష్మణుడు దగ్గరగా వచ్చి "ఊర్మిళా" అన్నాడు.

ఆమె శ్రవణేంద్రియాలలో ఆ పిలుపు శంఖారావమై వినిపిస్తుండగా "ప్రభూ" అంటూ భర్త పాదాలపై వాలింది.

"దేవీ" అంటూ కిందకి వంగి ఆమెని లేవనెత్తే ప్రయత్నం చేసాడు. అతని గొంతులో తొణికిస లాడిన లాలన లీలగా వినిపిస్తోందామెకి. భర్త ఆ గదిలోకి ప్రవేశించడాన్ని వేయి కళ్లతో చూసిన ఆమె పంచేంద్రియాలూ...అతను తిరిగి వెళ్లడాన్ని సహించలేక గాఢనిద్రకి ఉపక్రమించాయి.